

నేడే కౌంటింగ్..
ఎవరో కింగ్

• నేటితో ఉత్కంఠకు తెర • గెలుపుపై ఎవరి ధీమా వారిదే • గెలుపు, మెజార్టీలపై భారీగా బెట్టింగ్

సనత్‌నగర్: ఈవీఎంలలో నిక్షిప్తమై ఉన్న అభ్యర్థుల ఫలితాలు మరికొన్ని గంటల్లో వెలువడి నేతల ఉత్కంఠకు తెరపడనుంది. సనత్‌నగర్ నియోజకవర్గంలోని ఆయా డివిజన్లలో జరిగిన పోలింగ్ తీరు ఆధారంగా ఇప్పటికే ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. ఈ డివిజన్‌లో తమకు, ఆ డివిజన్‌లో మాకు మెజారిటీ వస్తోందంటూ లెక్కలేసుకుంటున్నారు. అంతిమంగా ఎవరికి వారు గెలుపు తమదేనంటూ ధీమాలో చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్ 66,464 (55.52 శాతం) ఓట్లు పొంది 30,651 (25.61 శాతం) మెజార్టీని సాధించారు. కాంగ్రెస్, టీడీపీ పొత్తులో భాగంగా టీడీపీ నుంచి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన కూన వెంకటేష్‌గౌడ్ 35,813 (29.91 శాతం) ఓట్లు పొందారు. ఇక అప్పటి బీజేపీ అభ్యర్థి భవర్‌లాల్‌వర్మకు 1424 (11.90 శాతం) ఓట్లు రాగా ఆయన తృతీయ స్థానంలో నిలిచారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా పార్టీలకు పోలైన ఓట్ల ఆధారంగా అభ్యర్థులు బేరీజు వేసుకుంటున్నారు.

లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు..

తాను గెలుపు ఖాయమని, మంచి మెజార్టీతో గెలుస్తున్నానని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రకటించారే తప్ప గతంతో పోలిస్తే మెజార్టీ పెరుగుతుందా.. తగ్గుతుందా? అనే అంశాలపై క్లారిటీ మాత్రం ఇవ్వలేకపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోట నీలిమ మాత్రం తనకు ప్రభుత్వ వ్యతిరేక ఓటింగ్‌తో పాటు గతంలో కాంగ్రెస్, టీడీపీ పొత్తులో పోలైన ఓట్లు గంపగుత్తగా పడతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఆమె ఎక్కువగా ముస్లిం ఓటు బ్యాంక్‌పై ఆశలు పెట్టుకున్నారు. ప్రచారం కూడా ఎక్కువగా ముస్లిం మైనార్టీలు ఉండే ప్రాంతాల్లోనే చేస్తూ వచ్చారు. బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి గతంలో ఆ పార్టీ అభ్యర్థి భవర్‌లాల్‌వర్మకు పోలైన ఓట్లతో పాటు కొత్తగా నమోదు చేసుకున్న యువత, విద్యావంతుల ఓట్లు తనకే పడ్డాయనే భావనతో ఉన్నారు. దీనికి తోడు గతంలో తాను చేసిన అభివృద్ధి, తన వ్యక్తిత్వం ఆధారంగా తనకు ఓట్లు వేశారని, దీంతో తన గెలుపు ఖాయమేనన్న ఆలోచనలో ఉన్నారు. గతంలో శ్రీనివాస్‌యాదవ్‌కు 30,651 ఓట్ల మెజార్టీ ఉండగా, అంత పెద్ద మెజార్టీని దాటుకుని గెలుపు దిశగా ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు వెళ్తారా?



తలసాని శ్రీనివాస్‌యాదవ్ బీఆర్‌ఎస్



కోట నీలిమ కాంగ్రెస్



మర్రి శశిధర్‌రెడ్డి బీజేపీ

భారీగా బెట్టింగ్‌లు?

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పోటీ చేస్తున్న సనత్‌నగర్ నియోజకవర్గం ఫలితంపై తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఉత్కంఠతగా ఎదురుచూస్తోంది. ఎందుకంటే ఏపీలో కూడా ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయి. ఈ క్రమంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్ గెలుపుపై లేదా మెజార్టీపై భారీగా బెట్టింగ్‌లు నడుస్తున్నట్లు సమాచారం. గెలిస్తే మెజార్టీ ఎంతలోపు ఉంటుందనే దానిపై కూడా జోరుగా బెట్టింగ్‌లు వేస్తున్నారు. బెట్టింగ్‌లతో కోట్లలో చేతులు మారే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎక్కువ సైతం ఆన్‌లైన్ బెట్టింగ్‌కే ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం.

లేదా అన్నది ప్రశ్నార్థకం. ఒక వేళ ఆ మెజార్టీని దాటుకుని వెళ్లారంటే ప్రభుత్వ వ్యతిరేక ఓటు భారీగానే ఉన్నట్లు స్పష్టంకాక తప్పదు.

గతంలో నోటాకు భారీగానే..

గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకు కూడా ఓట్లు బాగానే పోలయ్యాయి. 2018 ఎన్నికల్లో 1464 (1.22 శాతం) ఓట్లు పోలవ్వగా, అంతకు ముందు 2014లో 1041 ఓట్లు పడ్డాయి. అంటే స్వతంత్ర అభ్యర్థుల కన్నా ఎక్కువగా నోటాకు పోల్ కావడం గమనార్హం. ఈ సారి ఏమాత్రం నోటాకు పోలవుతాయో వేచి చూడాలి.

హ్యాట్రిక్‌కు ఒకరు.. గెలుపు ధీమాలో ఇద్దరు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పలువురు బరిలో నిలిచినా ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోరు నెలకొంది. నియోజకవర్గం ఆవిర్భావం నుంచి గత శాసనసభ ఎన్నికల వరకు మూడు సార్లు వరుస విజయాలు సాధించిన నాయకుడు లేడనే చెప్పాలి. ఇక్కడి నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నాలుగుసార్లు పోటీ చేసిన పద్మారావుగౌడ్ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే మూడు వరుస విజయాలతో హ్యాట్రిక్ మాత్రం దక్కలేదు. 2014, 2018 శాసనసభ ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన పద్మారావుగౌడ్ ఈ మారు కూడా విజయం సాధించి హ్యాట్రిక్ సాధిస్తామన్న నమ్మకంతో ఉన్నారు. నిన్న మొన్నటి వరకు పద్మారావు

ఆసక్తిగా ఎదురు చూస్తున్న లష్కర్ ఓటర్లు

గెలుపు ఖాయమన్న ధీమాలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులకు పోలింగ్ అనంతరం వెలువడిన ఎగ్జిట్ పోల్ ఫలితాలు కొంతమేర నిరాశకు గురి చేశాయి. అయినా భారీ మెజారిటీ రాకపోయినా పద్మారావు గెలుపు ఖాయమన్న ధీమాను బీఆర్‌ఎస్ నాసయకులు వ్యక్తం చేస్తున్నారు.

◆ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆదం సంతోష్‌కుమార్ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వ్యతిరేకత, స్థానికంగా ఎమ్మెల్యే వైఫల్యాలు తనను సునాయసంగా గెలిపిస్తాయన్న ధీమాలో ఉన్నారు. అదీ కాకుండా స్థానికత పేరుతో స్థానిక ప్రజల మద్దతు కూడగట్టేందుకు ఆదం సంతోష్‌కుమార్ శతవిధాల కృషి చేశారు. తొలిసారిగా కాంగ్రెస్ పార్టీ స్థానికుడినైన తనకు టికెట్ ఇచ్చి గౌరవించిందని తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇలాంటి ప్రయత్నాల ఫలితంగానే తన విజయం ఖాయమంటున్నారు ఆదం సంతోష్‌కుమార్.

◆ బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లతో పోల్చితే ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణి కాస్త వెనుకబడ్డ మాట వాస్తవం. అయినప్పటికీ గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలిచిన ఓటర్లు ఈమారు తనను గెలిపిస్తారన్న ఆత్మవిశ్వాసంలో మేకల సారంగపాణి ఉన్నారు. మోదీ పరిపాలనా విధానాలు తన విజయానికి అండగా నిలుస్తాయనే ధీమాలో ఉన్నారు.



పద్మారావుగౌడ్ బీఆర్‌ఎస్



సంతోష్‌కుమార్ కాంగ్రెస్



మేకల సారంగపాణి బీజేపీ

తార్నాకలో సినీ తారల సందడి



క్లాప్ కొడుతున్న ప్రొడ్యూసర్లు

లాలాపేట: శ్రీవైష్ణవి మూవీ మేకర్స్ బ్యానర్‌పై రూపొందుతున్న వెంకీ వర్స్ నాగ్ చిత్రం బృందం శనివారం తార్నాకలో సందడి చేసింది. తార్నాకలోని గణపతి దేవాలంయలో హీరో, హీరోయిన్, ప్రొడ్యూసర్లు ప్రత్యేక పూజలు చేసి క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. లాలాపేటకు చెందిన ప్రొడ్యూసర్లు మల్లిగారి ప్రవీణ్‌కుమార్, గౌడెల్లి కొండల్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీవైష్ణవీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిఖిల్ తేజ దర్శకత్వంలో హీరో ఆకాష్, హీరోయిన్ శివాణితో మొట్టమొదటిసారి నిర్మాణం చేస్తున్న ఈ సినిమాను ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో ప్రొడ్యూసర్లు మల్లిగారి మహేందర్, కో డైరెక్టర్ వికాస్, మ్యూజిక్ డైరెక్టర్ సుధాశ్రీనివాస్, రమేష్

పద్మారావు గెలవాలని పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిలకలగూడ: తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఏర్పాటు, సికింద్రాబాద్‌లో తీగుళ్ల పద్మారావుకు విజయం చేకూరాలని బీఆర్‌ఎస్ నాయకులు చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని, సికింద్రాబాద్‌లో పద్మారావు అఖండ మెజార్టీతో హ్యాట్రిక్ సాధిస్తారని అన్నారు. పూజల్లో జలంధర్‌రెడ్డి, రాజుసుందర్, కాసరబాద వెంకటేష్, శ్రీనివాసగౌడ్, డైమండ్‌శ్రీను, శ్రీధర్, టీవీ శ్రీను, శంకర్, సతీష్, సాయి పాల్గొన్నారు.

బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

లిబర్టీ: పార్లమెంటు సమావేశాలు ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బీసీ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కుల గణన చేసేందుకు ప్రధాన మంత్రి స్పష్టమైన ప్రకటన చేసి తమ చిత్తశుద్ధిని నిలుపుకోవాలని కోరారు. శనివారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల బీసీ కులగణన చేసేందుకు నిర్ణయం తీసుకున్నాయని ఆయా రాష్ట్రాల ఆదర్శంతో కేంద్ర ప్రభుత్వం కూడా నిర్ణయం తీసుకోవాలని కుమారస్వామి డిమాండ్ చేశారు. నేతలు సుభాష్, నవ్య, చరణ్, సాయి పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సికింద్రాబాద్ వెస్లీ కళాశాల ప్రాంగణంలో లెక్కింపు చేపట్టనున్న నేపథ్యంలో అవసరమైన సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు కల్పించినట్లు రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్ వెల్లడించారు. నియోజకవర్గం పరిధిలో మొత్తం 2,50,733 మంది ఓటర్లు ఉండగా, 1,23,766 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 62,012 మంది కాగా, మహిళలు 61,751, ఇతరులు ముగ్గురు ఉన్నారు. 232 పోలింగ్ కేంద్రాలతో పాటు మూడు అదనపు పోలింగ్ స్టేషన్లతో కలిపి మొత్తం 235 ఈవీఎంలో ఓట్లు నిక్షిప్తమై ఉన్నాయి. ఒక్కో రౌండ్‌లో 14 ఈవీఎంలకు సంబంధించిన ఓట్లను లెక్కిస్తారు. ఈ మేరకు 17 రౌండ్‌లకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తవుతోంది.

ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో..

సికింద్రాబాద్: సికింద్రాబాద్ అసెంబ్లీ ఎన్నికల కోసం జరిగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గం మొత్తం మీద 2,62,517 మంది ఓటర్లు ఉండగా అందులో 1,41,104 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీరందరి ఓట్లు లెక్కించడం కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో రౌండ్‌కు సుమారు 10 వేల ఓట్ల చొప్పున 14 రౌండ్లలో లెక్కింపును పూర్తి చేస్తారు. పోస్టల్ ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేకంగా మరో రెండు టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియను పోస్టల్ బ్యాలెట్లతో ప్రారంభించనున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలోని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచిన ఈవీఎంలను అదే భవనంలో లెక్కించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. భవనం బయట, వెలుపల మూడంచెల భారీ పోలీసు బందోబస్తును పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు. లెక్కింపు, భద్రత కోసం కలిపి మొత్తం 600 మందిని నియమించినట్టు సికింద్రాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.ఎల్లారెడ్డి తెలిపారు.

సందడిగా 'కార్తీక' వనభోజనాలు



వయోవృద్ధులను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సనత్‌నగర్: జెక్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కార్తీక వన భోజన కార్యక్రమం సందడిగా జరిగింది. సనత్‌నగర్ ఇండస్ట్రియల్ పార్కులో ప్రతియేటా లాగా నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో వయోవృద్ధులు తమ అనుభవాలను పంచుకున్నారు. పదవీ విరమణ తర్వాత తాము చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి పలువురు ఈ వేదికపై తెలిపారు. అసోసియేషన్ తరుపున చేపట్టిన, చేపడుతున్న వివరాలను ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు వివరించారు. అలాగే 75 ఏళ్లు పైబడిన వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు జీఎస్‌టీ శాయి మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్‌కు ప్రతియేటా క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఈ సారి కూడా జరిగే పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేత కొలను బాల్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్‌రావు, ఉపాధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ బాషా, కోశాధికారి ఓఎస్‌ఆర్ రెడ్డి, మల్లు ప్రసాద్, విశ్వనాథరాజు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు


సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 20, పందిరి బీర 35, క్యాబేజీ 11, క్యారెట్ 32, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 36, ఆలుగడ్డ 23, చామగడ్డ 37, మొరంగడ్డ 18, కందగడ్డ 47, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6.

జలవిహార్‌లో సందడిగా 'ధర్మ సంపద్'

ఖైరతాబాద్: అయోధ్యలో నిర్మితమైన రామ మందిరం అమృత్ మహోత్సవ కార్యక్రమం జనవరి 14 నుంచి 22 వరకు జరుగనున్న నేపథ్యంలో శనివారం రామ భద్రాచార్య మహరాజ్ జలవిహార్‌లో ఏర్పాటు చేసిన ధర్మ సంపద్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఎంతో అద్భుతంగా నిర్మితమైన రామ మందిరం జనవరి 14 నుంచి 22 వరకు అయోధ్యలో జరిగే అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో రామ భక్తులంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. జై శ్రీరాం అంటూ ప్రవచనాలు చెప్పారు. అగర్వాల్ సమాజ్ సభ్యులు మాట్లాడుతూ... అయోధ్యలో జరిగే అమృత్ మహోత్సవ్ కార్యక్రమానికి సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రైలు సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

వరల్డ్ టెన్నిస్‌లో సత్తా

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట లక్ష్మీనగర్‌లోని శ్రీ దుర్గా హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి సామల శౌర్య వరల్డ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సత్తా చాటారు. సౌతాఫ్రికాలో గత వారం జరిగిన వరల్డ్ టెన్నిస్ టోర్నమెంట్ జే–30లో సామల శౌర్య ఇండియా ప్రతినిధిగా పాల్గొని రెండవ స్థానంలో నిలిచారు. శనివారం లాలాగూడ ఇన్‌స్పెక్టర్ మధులత సమక్షంలో శౌర్యను పాఠశాల యాజమాన్యం సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నర్సింహారెడ్డి, స్వరూపారాణి పాల్గొన్నారు.



శౌర్యను సన్మానిస్తున్న ఇన్‌స్పెక్టర్ మధులత

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న కార్డినల్ పూల ఆంథోనీ

కంటోన్మెంట్: విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో లక్ష్య సాధనకు కృషి చేయాలని కార్డినల్ పూల ఆంథోనీ అన్నారు. హైదరాబాద్ ఆర్డ్ డయాసిస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ స్కూల్ ఆవరణలో నిర్వహించి 13వ టాలెంట్ ఫెస్ట్ ముగింపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం కల్పించే టాలెంట్ టెస్ట్‌ల ద్వారా వారిలో సృజనాత్మకతను వెలికి తీయవచ్చన్నారు. టాలెంట్ ఫెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఏఈఎస్ వైస్ చైర్మన్ యేరువ బాలశౌరి రెడ్డి, సెక్రెటరీ రెవరెండ్ ఫాదర్ ఆంథోనీ, ఆర్గనైజింగ్ కమిటీ రెవరెండ్ ఫాదర్ ఇన్నయ్య, రెవరెండ్ ఫాదర్స్ జయరాజ్ రెడ్డి, జయ ప్రతాప్, ఉదయ్ భాస్కర్ రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.



ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

కస్తూర్బా గాంధీ డిగ్రీ, పీజీ మహిళా కళాశాల గ్రాడ్యుయేషన్ వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చరణ్ లక్కరాజు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికలతో ముందుకెళ్తే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అశోక్ గోపతి, వైస్ చైర్మన్ ఉమా మహేశ్వర్, గౌరవ కార్యదర్శి మహ్మద్ ఫహీముద్దీన్, జాయింట్ సెక్రటరీ సురేష్ కుమార్, కోశాధికారి డాక్టర్ శైలజా రాజ్, డైరెక్టర్ ప్రొ.నీల గొల్లపూడి పాల్గొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో

ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం



నాగులూరి సాయిబాబాకు ఆహ్వానపత్రిక అందిస్తున్న కమిటీ సభ్యులు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీలోని రేణుకాఎల్లమ్మ దేవాలయ 15వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 4న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబాను శనివారం కలిసి అమ్మవారి కల్యాణోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రిక అందించారు. ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ప్రజలు, భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఆలయ నిర్వాహక కమిటీ ప్రతినిధులు మల్లేష్, శేషగిరిరావు, సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీకాంత్, యశ్వంత్ పాల్గొన్నారు.

పేదలకు చేయూత

లిబర్టీ: ఆకలితో అల్లాడుతున్న పేదలకు ఆహారం, అల్పాహారం అందించి ఆ యువకుడు ఆదర్శంగా నిలిచాడు. ఒకవైపు విద్యాభ్యాసం చేస్తూ మరో వైపు తనకు వచ్చిన స్కాలర్‌షిప్‌తో పేదరికంలో మగ్గుతూ ఫుత్‌పాత్‌లపై, రైల్వే స్టేషన్‌లలో జీవనం సాగిస్తున్న నిరుపేదలకు చేయూతనిస్తున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ విద్యార్థులు చేస్తున్న ఇటికాల గణేష్ తనకు వచ్చిన స్కాలర్‌షిప్‌తో ఆప్తుల అనురాగాలకు నోచుకోక నా అన్నవాళ్లు లేక పేదరికంలో గడుపుతూ సహాయం కోసం ఎదురు చూస్తున్న వారికి ఆహారం అందిస్తూ అక్కున చేర్చుకుంటున్నారు.

రూ.70లక్షలు గోల్‌మాల్ ?

అభ్యర్థి పరేషాన్

రాంగోపాల్‌పేట్: ఎన్నికలు పూర్తయ్యాయి అభ్యర్థుల జాతకాలు కొద్ది గంటల్లో తేలనున్నాయి. కానీ ఎన్నికల్లో గెలవాలనే ఉద్దేశంతో ఖర్చు విషయమై ఎవరూ ఆలోచించలేదు. ఎక్కడ ఎవరు ఎంత కావాలంటే అంత, అడిగినంత పంచేశారు. ఇదే అదనుగా కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు అభ్యర్థులు చేతివాటం ప్రదర్శించారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి ఓ ద్వితీయ శ్రేణి నాయకుడిని నమ్మి రూ.2 కోట్లు అప్పగించింది. అయితే అతను అభ్యర్థి చెప్పిన వారందరికీ డబ్బులు పంచినట్లు చెప్పాడు. కానీ ఇంకా రూ.70 లక్షలు మాత్రం లెక్క తేలలేదు. ఎన్నికలు పూర్తయ్యాక సదరు అభ్యర్థి లెక్కలు అడిగితే పోలీసులు వచ్చారు, ఆ డబ్బును ఎక్కడో పడేశాను అని సమాధానం ఇచ్చాడు. దీంతో డబ్బు తెచ్చి ఇవ్వాలని అభ్యర్థి ఒత్తిడి చేయడంతో సదరు నాయకుడు తనకు ఒంట్లో బాగో లేదని వచ్చి చెబుతానని సమాధానం చెప్పడం గమనార్హం.

పార్టీలు మారే ఎమ్మెల్యేల భరతం పట్టాలి

విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళి

పంజగుట్ట: రాబోయే 48 గంటల్లో నాయకులు అమ్ముడు పోయ్యేందుకు సిద్ధంగా ఉంటారని ప్రజాస్వామ్యవాదులు, నిరుద్యోగులు ఐక్యమై పార్టీలు మారే ఎమ్మెల్యేల భరతం పట్టాలని తెలంగాణ ప్రజాస్వామ్య వేదిక కన్వీనర్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. పార్టీలు మారే అవకాశం ఉన్న నాయకులు, పార్టీ మారితే మీ ఇళ్లు ముట్టడిస్తామని, బయట తిరగనివ్వమని ఫలితాలకు ముందే సందేశం పంపిద్దామని ఆయన సూచించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయుడు కమల్ సతీష్ అధ్యక్షతన 'ఏం చేద్దాం' అనే అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం ఆయన మాట్లాడారు. మన దేశంలో చాలా చట్టాలు, రాజ్యాంగం, సంస్కృతి ఉన్నాయని కాని రాజకీయ నాయకులు ఏ ఒక్కటీ పాటించరని, రాజకీయ సంస్కృతే దారుణంగా ఉందన్నారు. తెలంగాణ ప్రజలు విజ్ఞతతో ఓటు వేశారని, ప్రభుత్వం కూలే అవకాశం ఉందని అన్ని సర్వేలు చెబుతున్నాయని కాని కేసీఆర్‌కు 40 సీట్లు వస్తే చాలు ఎమ్మెల్యేలను కొనేస్తారు అనే ప్రచారం ఉందని, బీజేపీ కూడా అదే ధోరణిలో ఉందన్నారు. ఈ ప్రభుత్వాన్ని కూల్చేందుకు, ప్రజాస్వామ్య రక్షణ చేసేందుకు ఎన్ని పోరాటాలు చేశామో ఇప్పుడు మరో పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, పృథ్వీరాజ్ యాదవ్, తెలంగాణ విఠల్, సంగెం సూర్యారావు, సీపీఎం నాయకులు డి.జి.నర్సింహారావు మాట్లాడారు.

